- కేసీఆర్‌ను కలిసిన బీసీ కమిషన్ మాజీ సభ్యులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్ గౌడ్, ఉపేంద్ర, శుభప్రద్ పటేల్ కలిశారు. శుక్రవారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న వీరు పలు అంశాలపై చర్చించారు. పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కేసీఆర్ వారికి సూచించారు. – హైదరాబాద్

# రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు
- బీఆర్ఎస్ అంటే సీఎం రేవంత్‌కు వణుకెందుకు?
- గూండాలను వదిలి మా పార్టీ నేతలనే అరెస్టు చేస్తరా?
- మా పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ విడుదల చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ రాజ్యం పేరిట రాష్ట్రంలో ఆనాటి ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలను గురువారం అర్ధరాత్రి వరకు అక్రమ అరెస్టులు చేసి, శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా హౌస్ అరెస్టులు చేస్తారా? అని మండిపడ్డారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవడానికి కూడా అనుమతి లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రికి వెన్నులో వణుకెందుకని ప్రశ్నించారు. మా పార్టీ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### గాంధీ అనుచర గూండాలను అరెస్టు చేయాలి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ దిగజారుడు విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తేల్చిచెప్పారు. ప్రశ్నించిన ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూలేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును, ఇతర అన్నివిషయాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారని తెలిపారు.

### బీఆర్ఎస్ యోధులకు వందనాలు

రౌడీ మూకలు దాడి చేసినా, రాళ్లు రువ్వినా, దాడులను ఆపాల్సిన పోలీసులు చేతులు ముడుచుకున్నా.. ధైర్యంగా నిలబడి పోరాడిన ప్రతీ ఒక్క గులాబీ సైనికుడికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. అండగా నిలిచిన ప్రతీ సోదరుడికి, సోదరికి, అలాగే సోషల్ మీడియాలో అండగా నిలిచిన యోధులకు వందనాలు అని పేర్కొన్నారు.

# ప్రాణత్యాగానికైనా సిద్ధం

- ప్రాణం పోయినా రేవంత్‌తో కాంప్రమైజ్ కాను
- రేవంత్‌కు సీఎం పదవి కేసీఆర్ ఇచ్చిన భిక్షే
- గాంధీతో సఖ్యత కోసమే ప్రయత్నించా
- సెటిలర్లకు వ్యతిరేకం కాదు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి . చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

దుండిగల్, సెప్టెంబర్ 13: తెలంగాణ కోసం ప్రాణత్యాగానికైనా తాను సిద్ధమని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాణం పోయినా సీఎం రేవంత్‌రెడ్డితో మాత్రం కాంప్రమైజ్ కానని తేల్చిచెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో సఖ్యత కోసమే తాను ప్రయత్నించానని, తానేమీ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఆయనే స్వయంగా తాను పార్టీ మారలేదని పేర్కొన్నారని, అందుకే తాము ఆయనను సత్కరించేందుకు వెళ్దామనడంలో తప్పేమిటని ప్రశ్నించారు. ఆంధ్రా సెటిలర్లకు తాను వ్యతిరేకం కాదని, తాను సెటిలర్లను గౌరవిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే గాంధీ అన్నట్టుగా ఇది తమ ఇద్దరి మధ్యన జరుగుతున్న యుద్ధమేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి తనస్థాయిని దిగజార్చుకొని మాట్లాడుతున్నారని విమర్శించారు. గత పదేండ్లలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అమాంతగా పెంచితే, దానిని దిగజార్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. రేవంత్‌కు సీఎం పదవి అనేది కేసీఆర్ ఇచ్చిన భిక్ష అని, కేసీఆరే తెలంగాణ తేకుంటే, ఈ నాడు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా? అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న వెకిలిచేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికే తిరుగుబాటు మొదలైందని చెప్పారు. తన పోరాటానికి అండగా నిలిచి మద్దతిస్తున్న ప్రతి ఒక్కరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నట్టు కౌశిక్‌రెడ్డి తెలిపారు.

### గాంధీ రాజీనామా చెయ్: శంభీపూర్‌రాజు


నిజంగా గాంధీకి నీతి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కాంగ్రెస్ టికెట్‌పై గెలుపొందాలని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ కార్యకర్తల కష్టం, శ్రమతో గెలిచిన ఆయన అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఆనాడు చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నానన్న గాంధీ ఆయన ఇంటికి వెళ్లి సమావేశం పెడతామంటే ఎందుకు బయపడుతున్నారని, అక్కడికి వెళ్లకుండా పోలీసులు తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా తిరుగుతూ తొడలు కొడుతుంటే చోద్యం చూస్తున్న పోలీసులు.. తమను అడ్డుకోవడం ఏ రకమైన ధర్మమని పేర్కొన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రభుత్వమే కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. సెటిలర్ల విషయంలో కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఒక సెక్షన్ ఆఫ్ మీడియా వక్రీకరించి, విషప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు.

### రాయదుర్గంలో ఎమ్మెల్యే కౌశిక్‌పై కేసు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 13: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదుచేశారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసంపై గురువారం దాడి చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌కు వెళ్లారు. సైబరాబాద్ సీపీ చాంబర్‌లోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవటంతో కమిషనరేట్ కార్యాలయ అడ్మిన్, ఏడీసీపీ రవిచందన్‌రెడ్డికి, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. దీనిపై రవిచందన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. బీఎన్ఎస్ 132, 351(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతోపాటు సైబరాబాద్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులు, నాయకులు మొత్తం 30 మందిపైనా కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని రాయదుర్గం పోలీసులు తెలిపారు.

# కౌశిక్‌రెడ్డిపై దాడికి సర్కార్‌దే బాధ్యత

- ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి పనే
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రమేయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిపై శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇది కచ్చితంగా రేవంత్‌రెడ్డి చేయించిన దాడే. దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. ఇదేం ప్రజాపాలన ఇదేం ఇందిరమ్మ రాజ్యం? పట్టపగలు హైదరాబాద్ నడిబొడ్డున ఒక ఎమ్మెల్యేపై జరిగిన దాడికి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ బాధ్యత వహించాలి. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలని డీజీపీని డిమాండ్ చేస్తు న్నాం. దాడి చేసిన వారిని అరెస్టు చేయాల్సింది పోయి.. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆడుతున్న వికృత రాజకీయ క్రీడలో తెలంగాణ పోలీసులు కూడా భాగం కావడం దారుణం' అని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒక ప్రజా ప్రతినిధి ఇంటి మీద పోలీసుల సమక్షంలో దాడి జరుగుతుంటే నియంత్రించకుండా.. రాత్రి నుంచి గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదని అన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

# రేవంత్ ప్రోద్బలంతోనే..

- దానం, గాంధీ, మైనంపల్లి ద్వారా విద్వేషాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెచ్చిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ముగ్గురు గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నపుడు ఎలా ఉండేవారని, ఇప్పుడు ఎలా అయ్యారని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కౌశిక్‌రెడ్డి వివాదంలో ఆంధ్ర, తెలంగాణ వివాదం లేదని, సీఎం కావాలనే దానినో వివాదంగా చేయాలని చూస్తున్నారని తెలిపారు. అసలు తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డే ఆటంకంగా మారారని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దృష్టి మళ్లించడానికి సీఎం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేతలపై వికృత దాడులు చేస్తున్నారని, నిర్బంధిస్తున్నారని ధ్వజమెత్తారు. దాడుల సంస్కృతి రాష్ట్రానికి మంచిది కాదని, పోరాడి సాధించుకున్న తెలంగాణను నాశనం చేయాలని రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారంటూ ఆరోపించారు. తెలంగాణను ప్రేమించే వారు రేవంత్ తీరును ఖండించాలని, పదేండ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి దాడుల సంస్కృతి ఉన్నదా? దీనిని కాంగ్రెస్ ఆహ్వానిస్తుందా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ మీద జరుగుతున్న ఈ దాడులను తెలంగాణ మేధావులు ఖండించాలని హితవు పలికారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికి గాంధీ ద్వారా రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

### అల్లకల్లోలానికి కుట్ర: దేవీప్రసాద్

రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు పన్నుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత దేవీప్రసాద్ అనుమానం వ్యక్తంచేశారు. ప్రతిపక్షంపై దాడులకు పురికొల్పుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలపై అణిచివేత ధోరణి సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్నింటిపైనా ప్రజలు లెక్కలు రాస్తున్నారని, తగిన సమయంలో బుద్ధిచెపుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన మేధావులు, బుద్ధిజీవులు ఇప్పుడు స్పందించాలని కోరారు.

# పీఏసీ ఇచ్చేందుకు భయమా?

- హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డికి ఇస్తే ప్రభుత్వానికి చుక్కలే
- అందుకే దొడ్డిదారిన అరికెపూడి గాంధీకి కట్టబెట్టారా?
- కాంగ్రెస్ వర్గాలు, రాజకీయ పరిశీలకుల్లో ఆసక్తికరమైన చర్చ





నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ పదవిని రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భయపడుతున్నది అన్న ప్రశ్న సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆనవాయితీ ప్రకారం కాకుండా ఓ ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవిని కట్టబెట్టి, రాష్ట్రంలో రెండు రోజులుగా తీవ్ర గందరగోళ పరిస్థితిని సృష్టించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహించాలనుకున్నప్పుడు ప్రధాన ప్రతిపక్ష ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించేందుకు వస్తున్న అడ్డంకులేమిటని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

లోక్‌సభ లేదా రాష్ట్రాల అసెంబ్లీల్లో పీఏసీకి ప్రత్యేక ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉన్నాయి. ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకతను ప్రదర్శించేందుకు, ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టకుండా నిరంతరం మానిటరింగ్ చేయడంలో పీఏసీ పాత్ర కీలకం. ఈ కమిటీ ప్రభుత్వ నిధుల ఖర్చు, ఆర్థికపరమైన వ్యవహారాలను పర్యవేక్షించవచ్చు, నిధుల దుర్వినియోగం లేదా అవినీతి వంటి ఆరోపణలపైనా విచారణ జరపవచ్చు, ప్రభుత్వ విభాగాల ఆడిట్ నివేదికలపైనా, ఆర్థిక కార్యకలాపాలపైనా సమీక్ష జరపవచ్చు. ఇలాంటి కమిటీకి చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీకి చెందిన సభ్యుడిని నియమించడం ద్వారా ప్రభుత్వాలు తమ పారదర్శకతను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాయి. అనేక సంవత్సరాలుగా ఇదే సాంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సాంప్రదాయానికి తూట్లు పొడుస్తూ అడ్డదారులు తొక్కింది. వాస్తవంగా పీఏసీ కమిటీ చైర్మన్‌గా మాజీ మంత్రులు, అసెంబ్లీ వ్యవహారాలపై మంచి పట్టు ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డిలో ఎవరో ఒకరికి అవకాశం దక్కాల్సి ఉంది. అలా కాకుండా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా ప్రకటించారు.

### హరీశ్‌రావు చైర్మన్ అయితే ఇక్కట్లు తప్పవనేనా?

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు, నిధుల కేటాయింపు, ఖర్చులను పర్యవేక్షించే అధికారం ఉన్న పీఏసీ కమిటీకి చైర్మన్‌గా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన హరీశ్‌రావు లేదా ప్రశాంత్‌రెడ్డి ఉంటే ఇక్కట్లు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ముఖ్యులకు భయం పట్టుకున్నట్టు తెలుస్తున్నది. అసలే ప్రభుత్వ పాలనపై, ఆర్థిక వ్యవహారాలపై అంతంతమాత్రం అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు వీరు కొరకరాని కొయ్యగా మారుతారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగినట్టు సమాచారం. ఇప్పటికే రెండుమార్లు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్‌దే పైచేయిగా సాగింది. అనేక అంశాల్లో బీఆర్ఎస్ సభ్యులు ముఖ్యంగా కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి వంటి సీనియర్లంతా ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలో కీలకమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవి హరీశ్‌రావు వంటి వారికి దక్కితే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవన్నది సీఎం భావన అని సమాచారం.

### అందుకే దొడ్డిదారిన చైర్మన్‌గా గాంధీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సీఎంతోపాటు ఆర్థిక మంత్రి, ఇతర ప్రభుత్వ ముఖ్యులకు పాలనపై, ఆర్థిక వ్యవహారాలపై సరైన పట్టు దొరకలేదన్న చర్చ సాగుతున్నది. ఈ పరిస్థితుల్లో హరీశ్‌రావు లేదా ప్రశాంత్‌రెడ్డి వంటి వారికి పీఏసీ చైర్మన్ పదవి దక్కితే తమకు ఇబ్బందులు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ నిధుల కేటాయింపు, ఖర్చులు ఇతర ఆర్థిక కార్యకలాపాలపై నిరంతరం పీఏసీ చైర్మన్‌గా నిఘా వేస్తే ప్రభుత్వ డొల్లతనం బహిర్గతం అవుతుందన్న భయంతోనే తమ చెప్పుచేతుల్లో ఉండే వ్యక్తికి బాధ్యతలు అప్పగించారని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరిన అరికపూడి గాంధీకి ఇవ్వడం ద్వారా అతను టెక్నికల్‌గా బీఆర్ఎస్ అని చూపవచ్చన్నది సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహంగా చెప్తున్నారు.



### రాష్ట్రంలో గాడ్సే పాలన: తుంగ బాలు

హైదరాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ): గాంధీ వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్.. తెలంగాణలో గాడ్సే పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత తుంగ బాలు మండిపడ్డారు. తనను హౌస్ అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీసిన ప్రతిసారీ కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటీవల ఖమ్మం, సిద్దిపేటలో హరీశ్‌రావుపై, నిన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని చెప్పారు. రేవంత్ పాలనలో ప్రజాప్రతినిధుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రేవంత్‌కు తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



### రేవంత్‌ది నియంత పాలన: సతీశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఒక ప్రకటనలో విమర్శించారు. న్యాయం కోసం ఆందోళనకు దిగిన మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేసి స్టేషన్లలో నిర్బంధించడం కాంగ్రెస్ సర్కారు అరాచకాలకు పరాకష్ఠ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, ప్రజావ్యతిరేక దుర్మార్గాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్‌కు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు కొత్తకాదని, అణిచివేయాలని చూస్తే ఉప్పెనలా పైకిలేస్తామని తెలిపారు.

# కేశంపేటలో బీఆర్ఎస్ నాయకులపై కేసు

- 10 మందిపై నమోదు చేసిన పోలీసులు
- పోలీసుల విధులకు అడ్డంకులు సృష్టించారని ఆరోపణ
- హోంగార్డు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్, సెప్టెంబర్ 13: రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్‌లో 10 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య వివాదం రాజుకున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి బృందాన్ని హైదరాబాద్ నుంచి కేశంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని సైబారాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే హోంగార్డు రమేశ్ కేశంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ కుమారులు వై రవియాదవ్, వై మురళీయాదవ్‌తోపాటు నవీన్, జమాల్‌ఖాన్, లక్ష్మణ్, జగన్, బండ నిరంజన్, మల్లయ్య, సుధాకర్, వెంకట్‌రెడ్డి, ధన్‌రాజ్‌లపై సెక్షన్ 126(2), 132, 189 (2), 191 (2), ఆర్/డబ్ల్యూ 190బీఎన్ఎస్, 3పీడీపీపీఏ కింద కేసు నమోదు చేశారు. కేశంపేట మండలం కొత్తపేటలో ఎమ్మెల్యేల బృందాన్ని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకోవడంతో పాటు వాహనం అద్దాలను పగులగొట్టారని, రాత్రి వేళలో పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగి విధులకు ఆటంకం కలిగించారని హోంగార్డు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌లో ఉన్నారా, కాంగ్రెస్‌లోనా?

## మీడియా ప్రశ్నకు సమాధానం దాటేసిన ఎమ్మెల్యే గాంధీ




హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'మీరు బీఆర్ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? ఇంతకూ ఏ పార్టీలో ఉన్నారు' అంటూ మీడియా అడిగిన ప్రశ్నకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సమాధానాన్ని దాటేశారు. ఇప్పటికే గాంధీ ఏ పార్టీలో ఉన్నారంటూ జరుగుతున్న రచ్చకు ఆయన తెరదించకపోగా, ఎప్పటికప్పుడు సమాధానం దాటేస్తూనే ఉన్నారు. తాజాగా గాంధీ తన ఇంటి వద్ద మీడియా సమావేశంలోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. తాను ఏ పార్టీలో ఉన్నానో కూడా డిసైడ్ చేసుకోలేని దుస్థితిలో ఒక ఎమ్మెల్యే ఉన్నారా? అన్న చర్చ కూడా మొదలైంది. శుక్రవారం ఉదయం నుంచి గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతుండగా, మరోవైపు వివేకానందనగర్‌లోని అరకపూడి గాంధీ ఇంటివద్ద పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి హైడ్రామా తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు.

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌పై గౌరవం

బీఆర్స్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అంటే ఎంతో అభిమానమని, వారు ఏ రోజూ ప్రజలను తప్పుగా మాట్లాడిన సందర్భాలు లేవని గాంధీ పేర్కొన్నారు. వీరు హుందాగా వ్యవహరించారని చెప్పారు. కేసీఆర్ ఉద్యమంతోపాటు పదేండ్ల పాలనలో ఆంధ్ర, తెలంగాణ పేరిట మాట కూడా తూలకుండా గౌరవంగా వ్యవహరించారని వివరించారు. కౌశిక్‌రెడ్డి పరుషంగా మాట్లాడటం వల్లే తాను ఆ విధంగా ప్రతిస్పందించాల్సి వచ్చిందని గాంధీ చెప్పారు. చివరగా తన పార్టీ ఏదంటూ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు.

# రాజ్యాంగానికి సీఎం రేవంత్ తూట్లు

- కౌశిక్ నిర్బంధం.. గాంధీకి రెడ్‌కార్పెట్
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ ఫైర్



బండ్లగూడ, సెప్టెంబర్ 13: సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనలో అడుగడుగునా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రాజ్యాంగబద్ధ పాలనే సాగడం లేదని, కనీసం రాజ్యాంగం ఎప్పుడైనా ఆయన చదివారా? అని ప్రశ్నించారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు గూండాయిజం చేయాలని సీఎం స్క్రిప్ట్ ఇచ్చి మరీ చేయిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం రక్షించబడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టుకుని ప్రతిచోట ప్రచారాన్ని కొనసాగిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని, ఇదేమి రాజ్యం, ఇదేమి న్యాయం అని మండిపడ్డారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు, నేతల గృహ నిర్బంధం, అక్రమ అరెస్టులే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఉదయం 8 గంటల నుంచి పోలీసులు తనను గృహనిర్బంధం చేశారని, తనును కలవడానికి వచ్చిన నేతలను అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. శాసనసభ్యుడైన పాడి కౌశిక్‌రెడ్డిని చంపడానికి గూండాలతో వచ్చిన అరికెపూడి గాంధీకి పోలీసులు రెడ్ కార్పెట్ వేసి పోలీస్‌స్టేషన్‌లో కుర్చీబెట్టారని, బాధితుడైన కౌశిక్‌రెడ్డిని నిర్బంధించారని విమర్శించారు. ఎసమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ ఆర్య క్షత్రియ, పుడరి సైదులు, బీఆర్ఎస్ బండ్లగూడ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, అరుణ, క్వీన్ ఎలిజబెత్, జంపన్న, భీమయ్య, నటరాజ్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.